క్లుప్తంగా

అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు



విజయపురి సౌత్: మాచర్ల మండల పరిధిలోని విజయపురి సౌత్‌లో గల 32, 33 రేషన్ షాపుల్లో తహసీల్దార్ కిరణ్ కుమార్ గురువారం ఆకస్మిక తనిఖీలు చేశారు. రికార్డులను పరిశీలించారు. రేషన్ డీలర్లంతా సమయపాలన పాటించాలని, సరుకులు సక్రమంగా సరఫరా చేయాలని తెలిపారు. అవకతవకలు పాల్పడే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఏపీపీగా శ్రీనివాస యాదవ్ నియామకం



మాచర్ల: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్(ఏపీపీ)గా గంగుల శ్రీనివాసయాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఉన్నత కోర్టు ఆదేశాల మేరకు ఆయన ఉత్తర్వులు అందుకుని, గురువారం రాత్రి మేజిస్ట్రేట్‌ను కలిసి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన్ను పలువురు న్యాయవాదులు అభినందించారు.అనంతరం బార్ అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో శ్రీనివాస యాదవ్ మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతలు సక్రమంగా నిర్వర్తిస్తానని తెలిపారు.

శ్రావణ మాస పూజలకు ప్రత్యేక ఏర్పాట్లు

మాచర్ల: శ్రావణ మాసం పురస్కరించుకుని పలు దేవాలయాల్లో వరలక్ష్మీ వ్రతాలు, కుంకుమ పూజలు నిర్వహించేందుకు కమిటీలు ఏర్పాట్లు చేశాయి. పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయం, అన్నపూర్ణేశ్వరి, ఆదిలక్ష్మి, లలితాంబ అమ్మవార్ల దేవాలయాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలకు అన్ని ఏర్పాట్లు చేశారు.

డ్రగ్స్ అనర్థాలపై విద్యార్థులకు అవగాహన



అమరావతి: యువత మత్తు పదార్థాలకు బానిసలై బంగారు భవిష్యత్‌ను చేజేతులా పాడు చేసుకుంటున్నారని ఎస్ఐ రాజశేఖర్ అన్నారు. గురువారం మండల పరిధిలోని ధరణికోట ఆర్‌వీవీఎన్ కళాశాల విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రాజశేఖర్ మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాలలో గంజాయి, వైట్‌నర్‌లు, బోన్‌ఫిక్స్‌లు, డ్రగ్స్‌కు యువకులు బానిసలవుతున్నారన్నారు. ప్రస్తుతం అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక పోలీసు నిఘా పెట్టామన్నారు. ఇటువంటి కార్యకలాపాలు నిర్వహించేవారు ఎవరైనా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను తెలిపేలా వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ధాన్యకటక ఎడ్యుకేషనల్ అకాడమీ విద్యార్థులు, ఆర్‌వీవీఎన్ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక ఆదాయం



నకరికల్లు: ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేస్తే అన్నదాతలకు అధిక ఆదాయం వస్తుందని స్టేట్ రిసోర్స్ పర్సన్ రామచంద్రం అన్నారు. నకరికల్లు రైతు సేవా కేంద్రంలో నకరికల్లు, కారంపూడి మండలాలకు చెందిన వీఏఏలకు మూడవ రోజు శిక్షణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రకృతి సాగులో తొమ్మిది సార్వత్రిక సూత్రాలను పాటించాలని అన్నారు. తొమ్మిది సార్వత్రిక సూత్రాలను వివరిస్తూ భూమిని 365 రోజులు పచ్చని పంటలతో కప్పి ఉంచడం ద్వారా భూమిలో కర్బనశాతం పెరుగుతుందన్నారు. రక్షక, ఆకర్షణ, జీవ వైవిధ్య పంటలు వేయడం ద్వారా ప్రధాన పంటకు చీడపీడల ఉధృతి తగ్గుతుందన్నారు. ఈ విధానంలో భూమిలో సూక్ష్మజీవుల వృద్ధి జరుగుతుందన్నారు. రైతు తన సొంత విత్తనాన్ని తానే తయారు చేసుకోవడం వలన ఖర్చు తగ్గుతుందని, చీడపీడలను తట్టుకునే శక్తి పంటకు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏవో దేవదాస్, జిల్లా అడిషనల్ ప్రాజెక్టు మేనేజర్ ప్రేమ్‌రాజ్, ప్రకృతి వ్యవసాయ జిల్లా సిబ్బంది ఎన్ఎఫ్ఏ అప్పలరాజు, నందకుమార్, వైపీ స్వాతి, ట్రైనర్ మాస్టర్ బాజీబాబు, సుబ్బారెడ్డి, హసీన, రామసుబ్బారెడ్డి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వాన్ని కూకటి వేళ్లతో పెకిలిస్తాం

ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై దాడిని ఖండించిన వైఎస్సార్ సీపీ నేతలు



నారాయణపురంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న నేతలు

దాచేపల్లి : బలహీన వర్గాలపై దాడులకు తెగబడుతున్న కూటమి ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో పెకిలిస్తామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు హెచ్చరించారు. వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై దాడిని తీవ్రంగా ఖండించారు. నారాయణపురంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో బలహీన వర్గాలపై దాడులు యథేచ్ఛగా జరుగుతున్నాయని తెలిపారు. వైఎస్సార్ సీపీకి అనుకూలంగా ఉన్న బలహీన వర్గాల ప్రజలపై, ప్రజాప్రతినిధులపై భౌతిక దాడులకు తెగబడుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు రక్షణ లేకుండా పోయిందని, రాష్ట్ర ప్రజలంతా బిక్కుబిక్కుమంటూ ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని బతకాల్సిన పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై దాడి బలహీన వర్గాలపై జరిగిన దాడిగా పేర్కొన్నారు. రానున్న రోజుల్లో కూటమి ప్రభుత్వం ఆగడాలను, దుర్మార్గాలను, దాడులను ప్రతిఘటించేలా బలహీన వర్గాల ప్రజలంతా ఏకం కావాల్సిన అవసరం ఉందని నాయకులు పేర్కొన్నారు. ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై దాడికి తెగబడ్డ కూటమి గూండాలను తక్షణమే అరెస్ట్ చేసి చట్టపరంగా కఠినమైన చర్యలు తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. సమావేశంలో ఎంపీపీ కందుల జాను, నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, జెడ్పీటీసీ సభ్యుడు మూలగొండ ప్రకాశ్ రెడ్డి, మాజీ సర్పంచ్ మందపాటి రమేష్ రెడ్డి, పార్టీ మండల, పట్టణ కన్వీనర్లు కోటా కృష్ణ, షేక్ సుభాని, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ జాకీర్ హుస్సేన్ , వైస్ ఎంపీపీ తండా అబ్దుల్ సత్తార్, వైస్ చైర్మన్ విజయ్ కుమార్, నాయకులు దాచేపల్లి సైదారావు, గరికపాటి సైదారావు, ఉల్లేరు హనుమంతరావు, జంగాల సింగరయ్య యాదవ్, కల్లూరి లింగయ్య యాదవ్, గరినే పుల్లారావు, జక్కా అశోక్, నాళ్లం శ్రీనివాసరావు, ఆవుల సైదులు, పాపా పాల్గొన్నారు.

ఆటోల్లో అధిక లోడుతో ప్రయాణిస్తే కఠిన చర్యలు



విజయపురిసౌత్: ఆటోల్లో ప్రయాణికులను పరిధికి మించి ఎక్కిస్తే కఠిన చర్యలు తప్పవని మాచర్ల రూరల్ సీఐ నఫీజ్ బాషా హెచ్చరించారు. కొత్తపల్లి జంక్షన్ వద్ద రోడ్డు ప్రమాదాలపై ప్రయాణికులకు, డ్రైవర్లకు గురువారం అవగాహన కల్పించారు. ఆటో డ్రైవర్‌లు, ద్విచక్ర వాహనదారులంతా తప్పనిసరిగా లైసెన్స్‌లు కలిగి ఉండాలని తెలిపారు. ద్విచక్ర వాహన దారులు తప్పనిసరిగరా హెల్మెట్ ధరించాలని సూచించారు. వాహనాల మీద ప్రయాణించేటప్పుడు రోడ్డు ప్రమాద సూచికలను గమనించాలని తెలిపారు. కార్యక్రమంలో విజయపురి సౌత్ ఎస్ఐ అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

నిధుల కేటాయింపులో ప్రాధాన్యత ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న చిన వెంకటేశ్వర్లు

పిడుగురాళ్ల: చేనేత కులాలకు నిధుల కేటాయింపులో ప్రాధాన్యత ఇవ్వాలని ఉమ్మడి గుంటూరు జిల్లా పద్మశాలి సంక్షేమ సంఘం అధ్యక్షులు శ్రీ కస్తూరి చిన వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని కోరారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా పట్టణంలోని శ్రీనివాస స్టూడియో ప్రాంగణంలో చేనేత కులాల ఐక్యవేదిక, పద్మశాలి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ పల్నాడు జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చేనేత నూలుపై జీఎస్టీ ఎత్తి వేయాలని, చేనేత కులాలకు సాంఘిక భద్రత కల్పించాలని కోరారు. ఉన్నత విద్య కోసం సహాయమందించాలని, ఆత్మహత్యల నివారణ కోసం ప్రత్యేక పథకాలు రూపొందించాలని తెలిపారు. చేనేతలు ఐక్యంగా ఉంటూ ఆత్మగౌరవంతో సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రజలు కూడా చేనేత వస్త్రాలు ధరించి, వృత్తిని ఆదుకోవాలని ఆయన కోరారు. అనంతరం ఇటీవల 10వ తరగతిలో అధిక మార్కులు సాధించిన బత్తుల భార్గవ గోపీకృష్ణకు ప్రోత్సాహంగా పి. సురేష్ రూ. 5 వేలు అందజేశారు. కార్యక్రమంలో సాముల హనుమంతరావు, దామచర్ల పట్టాభి, పాత స్వామి, గుర్రం హనుమంతరావు, శ్రీనివాసరావు, గోలి విశ్వేశ్వరరావు, దామెర్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆల్‌బెండజోల్ మాత్రల పంపిణీపై కార్యాచరణ

కారెంపూడి: జాతీయ నులి పురుగుల నివారణా దినోత్సవంలో భాగంగా స్థానిక పీహెచ్‌సీలో గురువారం సాయంత్రం మండల స్థాయి అధికారుల ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జాతీయ నులి పురుగుల నివారణా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 12న విద్యార్థులకు ఆల్‌బెండజోల్ మాత్రల పంపిణీపై కార్యాచరణను రూపొందించారు. అన్ని పాఠశాలలు, కళాశాలలతో పాటు 1 నుంచి 19 ఏళ్ల మధ్య వయస్సున్న అందరికీ మాత్రలు పంపిణీతో పాటు మింగేలా కార్యక్రమాలను గ్రామాల వారీగా రూపొందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్, ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, పీహెచ్‌సీ డాక్టర్ రమ్య, డాక్టర్ విజయా నాయక్ పాల్గొన్నారు.

పలువురికి మాజీ ఎమ్మెల్యే కాసు పరామర్శలు



బ్రహ్మారెడ్డి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి

దాచేపల్లి : మండలంలోని పెదగార్లపాడులో మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి గురువారం పర్యటించారు. గ్రామానికి చెందిన కామిరెడ్డి శ్రీనివాసరెడ్డి కుమారుడు బ్రహ్మారెడ్డి బుధవారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే.ఈ నేపథ్యంలో శ్రీనివాసరెడ్డి కుటుంబాన్ని పరామర్శించి, ధైర్యం చెప్పారు. అనంతరం దాచేపల్లి చెందిన వైఎస్సార్ సీపీ నేత ఔరంగాబాద్ వెంకటేశ్వర్లు సతీమణి నరసమ్మ ఇటీవల మృతి చెందటంతో కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతున్న నారాయణపురానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత పల్లె వెంగళరెడ్డి కుమారుడు కిశోర్ ఆరోగ్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పార్టీ మండల, పట్టణ కన్వీనర్లు కోట కృష్ణ, షేక్ సుభాని, ఎంపీపీ కందులు జాను, జెడ్పీటీసీ సభ్యుడు మూలగుండ్ల ప్రకాష్ రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, నాయకులు మందపాటి రమేష్ రెడ్డి, కర్పూరపు వెంకట కోటయ్య, షేక్ జాకీర్ హుస్సేన్, ముత్యం చెన్నారెడ్డి, లింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు.

లింగాకర్షణ బుట్టలతో పురుగు ఉధృతికి అడ్డుకట్ట



పత్తి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

దుర్గి: మండలంలోని ఓబులేశునిపల్లెలో పత్తి పంటను జిల్లా ఏరువాక కేంద్రం కో–ఆర్డినేటర్ ఎం. నగేష్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం గులాబీ రంగు పురుగు పంటను ఆశించలేదని తెలిపారు. అయినా, రైతులంతా ఎకరానికి 20 లింగాకర్షణ బుట్టలు పెట్టుకోవాలని సూచించారు. బుట్టలో పురుగుల ఉధృతి 8 నుంచి 10 ఉన్నట్లయితే సైపర్ మైత్రిన్ 25% ఈసీసీ ఎకరాకు 250 గ్రాములు, సైపర్ మైత్రిన్ 10% ఈసీసీ పిచికారీ చేయాలని తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఆకుపై మచ్చలు వస్తున్నాయని, నివారణకు ప్రాపికోనోజోల్‌ను ఒక గ్రాము లీటర్ నీటికి లేదా హెక్సా కోనజోల్ 1.5 ఎం.ఎల్. ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డాట్ కో– ఆర్డినేటర్ సీఎం నగేష్, మండల వ్యవసాయాధికారి వై. అమీర్ రెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న జడ్జి ప్రియదర్శిని



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి టి. ప్రవళిక

గురజాల : జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ పడదగిన కేసులను రద్దు చేసుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, పదవ అదనపు జిల్లా జడ్జి జి. ప్రియదర్శిని తెలిపారు. స్థానిక కోర్టులో గురువారం జాతీయ లోక్ అదాలత్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సెప్టెంబర్13న నిర్వహించనున్న లోక్ అదాలత్‌లో సివిల్, క్రిమినల్, చెక్ బౌన్సు, మోటారు వెహికల్ కేసులను రాజీ చేకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ డివిజన్ సివిల్ జడ్జి వై. శ్రీనివాసరావు, జూనియర్ సివిల్ జడ్జి కె.వి.వి. సత్యనారాయణ, బార్ అధ్యక్షుడు కోటా శ్రీనివాసరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

పిడుగురాళ్లలో...

వచ్చే నెల 13న నిర్వహించనున్న లోక్ అదాలత్‌ను కక్షిదారులంతా వినియోగించుకోవాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి టి. ప్రవళిక సూచించారు. పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్టు ప్రాంగణంలో బార్ అసోసియేషన్ సభ్యులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేసులను రాజీ మార్గంలో పరిష్కరించేందుకు బార్ అసోసియేషన్ సభ్యులు సహకరించాలని ఆమె కోరారు. కక్షిదారులకు కూడా అవగాహన కల్పించి లోక్ అదాలత్‌లో రాజీ పడే విధంగా చర్యలు తీసుకోవాలని ఆమె తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు కుమారస్వామి, సెక్రటరీ కె. వెంకటేశ్వర్లు, న్యాయవాదులు బి.దాస్, రమేష్, పిచ్చయ్య, ఈషా అహమద్, ఎం. వెంకటేశ్వర్లు, సీతారామయ్య, అచ్చారావు, కోటేశ్వరరావు, ప్రశాంత్ నాయక్, పిడుగురాళ్ల, మాచవరం కోర్టు కానిస్టేబుల్స్, ఎక్సైజ్ పోలీసులు, కోర్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

లగడపాడులో ఘనంగా చేనేత దినోత్సవం



పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు అందిస్తున్న జంజనం కోటేశ్వరరావు

పెదకూరపాడు: మండలంలోని లగడపాడు గ్రామంలో జాతీయ చేనేత ఐక్య వేదిక సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం జరిగింది. చేనేత ఐక్య వేదిక సంఘం కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడు చిల్లపల్లి సత్యం అధ్యక్షత వహించారు. పెదకూరపాడు అధ్యక్షుడు గోలి యల్లమందయ్య, పల్నాడు జిల్లా గౌరవ సలహాదారు వెంకట్రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆంధ్ర రాష్ట్ర సమితి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జంజనం కోటేశ్వరరావు పాల్గొని చేనేత కార్మికుల హక్కులు రాయితీలు కోసం చేసే పోరాటంలో పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న సెంట్రల్ రిజర్వుడ్ సీఐ అంకారావు నేతన్నలు ప్రభుత్వ సేవలు ఉపయోగించుకొని సాంకేతికంగా ముందుకు పోవాలని అన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు టీ షర్టులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్ నాగేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు లగడపాడు శాఖాధికారి గంగాధర్ పాల్గొని ప్రసంగించారు. గ్రామ కమిటీ సభ్యులు, నేతన్నలు పాల్గొన్నారు.

అద్దె భవనాల్లో అగచాట్లు

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు నిలువ నీడ కరువు



గురజాలలోని అంగన్‌వాడీ కేంద్రం(ఫైల్)

గురజాల : అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు అద్దె భవనాల్లో అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం ఇచ్చే డబ్బులతో నిర్వహించలేక కేంద్రాల కార్యకర్తలు ఇబ్బందులు పడుతున్నారు. పెరుగుతున్న ఖర్చుల నేపథ్యంలో అంగన్‌వాడీలకు కేంద్రాల నిర్వహణ భారంగా మారింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమకూర్చే నిధులతో రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలు నడుస్తున్నాయి. నిర్వహణకు గాను గ్రామీణ ప్రాంతాల్లో రూ.2వేలు, పట్టణ ప్రాంతంలో రూ.4వేలు అద్దె నిమిత్తం ఇస్తున్నారు. ఇవి ఎంత మాత్రం సరిపోవడం లేదు.

సిబ్బందిపై ఆర్థిక భారం

కేంద్రాల నిర్వహణలో అంగన్‌వాడీ కార్యకర్తలపై ఆర్థిక భారం పడుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల అద్దెలు రూ.3వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.5వేలకు పైగా ఉంటున్నాయి. ప్రభుత్వం ఇచ్చే నగదు సరిపోవడం లేదు. భవనాలు కూడా సరిపోక పోవడంతో వస్తువులు, పరికరాలు దాచుకోవడం ఇబ్బందిగా ఉంది. గురజాల ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో గురజాలలో 56, దాచేపల్లిలో 76 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటిల్లో గురజాలలో 13, దాచేపల్లిలో తొమ్మిది కేంద్రాలకు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి. గురజాలలో 3, దాచేపల్లిలో 4 కేంద్రాలు మాత్రమే ప్రభుత్వ భవనాల్లో నడుస్తున్నాయి. గురజాలలో 40, దాచేపల్లిలో 63 కేంద్రాలు అద్దె భవనాల్లోనే ఉన్నాయి. ఇరుకిరుకు భవనాల్లో చిన్నారులు ఆటలాడుకునేందుకు, గర్భిణులు, బాలింతలు కూర్చొనేందుకు గాను వీలుగా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని కార్యకర్తలు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

స్వామిత్ర ద్వారా శాశ్వత హక్కుపత్రాలు



నకరికల్లు: నివేశన స్థలాలకు శాశ్వత హక్కు పత్రాలు కల్పించేందుకు ప్రభుత్వం స్వామిత్ర కార్యక్రమం రూపొందించిందని పల్నాడు జిల్లా పంచాయతీ రాజ్ అధికారి నాగేశ్వరనాయక్ అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని గృహాలు, నివేశన స్థలాలకు శాశ్వత హక్కు పత్రాలు మంజూరు చేసే కార్యక్రమాన్ని గురువారం ఆయన పరిశీలించి, మాట్లాడుతూ సర్వే చేసే సిబ్బంది సమగ్ర వివరాలతో పూర్తి స్థాయి సర్వే చేపట్టి సకాలంలో నివేదిక అందజేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ కె.వి.శివప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బోనస్ పంపిణీ



పెదకూరపాడు (అచంపేట): అచ్చంపేట మండలంలోని పెద్దపాలెం సంగం డెయిరీలో పాలు పోసిన పాల ఉత్పత్తిదారులకు గురువారం సంగం డెయిరీ డైరెక్టర్ వలివేటి ధర్మారావు చేతుల మీదగా రూ.4,63,000 బోనస్ అందించారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు వెంకటనారాయణ, కార్యదర్శులు నరసింహారావు, గోపి, రాములు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



క్రోసూరు: జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశాల మేరకు గురువారం క్రోసూరులోని మండల పరిషత్ కార్యాలయంలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు సంస్థ జిల్లా చైర్మన్ ఎంఆర్ శేషగిరిరావు తెలియజేశారు. ఈ శిబిరాన్ని మండల తహసీల్దార్ వి.వి.నాగరాజు , ఎస్ఐ పి.రవిబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశాల మేరకు మండల రెవెన్యూ అధికారులు, సిబ్బంది, గ్రామ ప్రజల సహకారంతో రక్తదాన శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు. శిబిరానికి సహకారం అందించిన ప్రభుత్వ ఉద్యోగులకు, గ్రామ ప్రజలకు ధన్యవాదాలు తెలియజేశారు. భవిష్యత్తులో ఇటువంటి సేవా కార్యక్రమాలను రెడ్ క్రాస్ సహకారంతో మరెన్నో చేస్తామని చెప్పారు. ఈ రక్తదాన శిబిరంలో 28 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో జి.రవికుమార్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ, వీఆర్వోలు, వీఆర్ఏలు, గ్రామ మండల నాయకులు, ప్రభుత్వ సిబ్బంది, రెడ్‌క్రాస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదు ప్రక్రియ జాగ్రత్తగా చేపట్టాలి

జిల్లా వ్యవసాయాధికారి ఎం.జగ్గారావు



పంట నమోదు విధానాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి జగ్గారావు

ఇరుకుపాలెం(ముప్పాళ్ళ): పంట నమోదు ప్రక్రియను జాగ్రత్తగా చేపట్టాలని, పంట రకం, పంట విస్తీర్ణం వివరాలు నమోదు చేయాలని జిల్లా వ్యవసాయాధికారి ఎం.జగ్గారావు చెప్పారు. మండలంలోని ఇరుకుపాలెం గ్రామంలో పంట నమోదు విధానాన్ని గురువారం పరిశీలించి నమోదులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మండలంలోని ప్రతి సర్వే నెంబర్‌లో పంటను నమోదు చేయాల్సిందేనన్నారు. పంట రకాలు మార్చటం జరగదని నిజమైన సాగుదార్లను, వాస్తవమైన రకాలను మాత్రమే నమోదు చేయాలని సూచించారు. పంటలు వేయని పొలాలను కూడా గుర్తించి తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. పంట రకాలు తప్పుగా నమోదు చేసినట్లయితే పంట కొనుగోలు సమయంలో ఇబ్బందులు వస్తాయని తెలిపారు. గమనించి పంట నమోదు జాగ్రత్తగా నమోదు చేయాలని ఆయన సూచించారు. మండల వ్యవసాయాధికారి ఎస్.శ్రీధర్‌రెడ్డి, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

విద్యతోనే ఆదివాసుల అభివృద్ధి



మాట్లాడుతున్న డీబీఆర్‌సీ గడ్డిపర్తి కోటిరత్నం

రాజుపాలెం: ఆదివాసులు విద్యా, ఉపాధి ద్వారనే అభివృద్ధిని సాధించగలరని డీబీఆర్‌సీ ఏరియా కో ఆర్డినేటర్ గడ్డిపర్తి కోటిరత్నం అన్నారు. మండల కేంద్రంలోని రాజుపాలెం పులిచింతల నిర్వాసిత కేంద్రంలో అంతర్జాతీయ ఆదివాసి దినోత్సవం సందర్భంగా దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో ఎస్టీలకు అవగాహన సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కోటిరత్నం మాట్లాడుతూ ఆదివాసులు అటవీ ప్రాంతంలో అడవిని నమ్ముకుని అడవిలో ఉన్న సంపదను తీసుకుని జీవనం కొనసాగిస్తారని, ఆదివాసులు, బంజారాలు ఆరాధ్య దైవంగా పూజించే శ్రీసంతొసేవాలాల్ మహరాజ్, ఏకలవ్య, చెంచు లక్ష్మీ జయంతి వేడుకలను ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని అన్నారు. కార్యక్రమంలో వీఆర్వో దుర్గాభాయి, వెలుగు సీసీ కోటమ్మ, మహిళా పోలీసు రమాదేవి, ఏపీవో వెంకటేశ్వర్లు, ఆదివాసులు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో బాజీ మృతి చెందడం బాధాకరం



సత్తెనపల్లి: వైఎస్సార్‌సీపీ నాయకుడు షేక్ సుభాని కుమారుడు షేక్ బాజీ (25) అనారోగ్యంతో అకాల మరణం చెందడం బాధాకరమని వైఎస్సార్‌సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్ రెడ్డి అన్నారు. మండలంలోని ఫణిదం గ్రామంలో బాజీ భౌతికకాయాన్ని గురువారం ఆయన సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు.